## ‘అరుణాచలం’కు ప్రత్యేక బస్సులు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 3 : తమిళనాడులోని అరుణాచలంలో నవంబర్ 27న జరిగే గిరి ప్రదక్షిణకు వెళ్లేందుకు సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు ఆర్ఎం జే శ్రీలత తెలిపారు. ఈ బస్సు నవంబర్ 25న రాత్రి 8 గంటలకు హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి 26వ తేదీ ఉదయం ఆంధ్రప్రదేశ్ కాణిపాకంలోని విఘ్నేశ్వరుడి దర్శనం, మధ్యాహ్నం వెల్లూరులోని మహాలక్ష్మీ అమ్మవారి దర్శనం అనంతరం రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. అరుణాచలేశ్వరస్వామి గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత తేదీ 27న మధ్యాహ్నం బయలుదేరి నవంబర్ 28న ఉదయం జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం సన్నిధికి వెళ్తుందని, దర్శనానంతరం హనుమకొండకు చేరుకుంటుందన్నారు. ఈ టూర్ ధరను ఒక్కొక్కరికి రూ.4500గా సంస్థ నిర్ణయించిందని తెలిపారు. ఈ సదుపాయాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు. ఈ ప్యాకేజీని tsrtconline.in లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు.

## చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

ఖానాపురం, నవంబర్ 3 : పురుగుల మందు తాగిన విద్యార్థిని చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మనుబోతులగడ్డ గ్రామానికి చెందిన బిక్కుసాబ్, షాహనాజ్ దంపతుల కుమార్తె ఆఫ్రిన్ (17) నర్సంపేటలోని ముస్లిం మైనారిటీ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. కొద్ది రోజుల క్రితం కళాశాలకు దసరా సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చింది. సెలవులు ముగియగానే అక్టోబర్ 31న తండ్రి కళాశాలకు వెళ్లమని చెప్పడంతో ఆఫ్రిన్ మనస్తాపానికి గురై పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందింది.

# కారు.. ప్రచార హోరు

- దూసుకెళ్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులు
- జనగామలో పల్లె, పట్నంలో ‘పల్లా’,
- పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఎర్రబెల్లి, కడియం ప్రజలతో మమేకం


చేర్యాలలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే రాజయ్య,

జనగామ, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ) : గెలుపే లక్ష్యంగా పక్కా వ్యూహంతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. సీఎం కేసీఆర్ పాలనలో తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, వచ్చే ఐదేళ్లలో అమలు చేసే అంశాలపై విడుదల చేసిన మ్యానిఫెస్టోపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ వివరిస్తున్నారు. ఓటర్లను కలిసి కారు..సారు..కేసీఆర్ నినాదంతో ముందుకుపోతున్నారు. ఆత్మీయ సమ్మేళనాలు, గ్రామ, మండల, నియోజకవర్గాల వారీగా ముఖ్య కార్యకర్తల సమావేశాలతో విస్తృత ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థుల కుటుంబ సభ్యులు సైతం ఎన్నికల ప్రచారంలో భాగస్వాములవుతూ తమదైన శైలిలో ప్రచారంలో ముందున్నారు. సోషల్ మీడియాలో ప్రత్యర్థి పార్టీల నాయకుల మాటలకు దీటుగా సమాధానం చెబుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూపుతూ ఎన్నికల క్షేత్రంలో సై అంటే సై అంటూ సవాల్ విసురుతున్నారు. కారు ప్రచార జోరును కొనసాగిస్తుంటే ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు డీలా పడుతున్నారు. జిల్లాలోని జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో అందరికంటే ముందే ఎన్నికల క్షేత్రంలోకి దిగిన బీఆర్ఎస్ పోలింగ్ సమీపిస్తుండగా ప్రచార దూకుడును పెంచింది. అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో జెట్ స్పీడ్‌తో పరుగులు పెడుతుంటే..కారు టాప్ గేర్‌లో లక్ష్యం వైపు దూసుకుపోతున్నది.

**ప్రజలతో బీఆర్ఎస్ అభ్యర్థులు మమేకం..**

ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే గులాబీ దళపతి, సీఎం కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించారు. అప్పటి నుంచే అభ్యర్థులు రంగంలోకి దిగి నిరంతరం ప్రజలతో మమేకమవుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. తమను ఆశీర్వదిస్తే రాబోయే ఐదేళ్లలో నియోజకవర్గాలను మరింత అద్భుతంగా తీర్చిదిద్దుతామంటూ వివిధ వర్గాలను, కుల సంఘాలను కలిసి మద్దతు కూడగడుతున్నారు. మూడు నియోజకవర్గాల్లో వివిధ పార్టీల నుంచి పెద్దఎత్తున బీఆర్ఎస్‌లో చేరికల పర్వం కొనసాగుతున్నది. కుల వృత్తులు, చాంబర్ ఆఫ్ కామర్స్ పరిధిలోని అన్ని వ్యాపార, వాణిజ్య సంస్థల అసోసియేషన్లు, డాక్టర్లు, మెడికల్‌షాపు యజమానులు, న్యాయవాదులు, జర్నలిస్టులు, రిటైర్డు ఉద్యోగులు, కాలనీ అసోసియేషన్లతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ మద్దతు కూడగడుతున్నారు. జనగామ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపునకు మాజీ మంత్రి పొన్నాల, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య సహా స్థానిక ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకెళ్తున్నారు. ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, అభ్యర్థి పల్లాతో కలిసి గ్రామాలు, పట్టణ వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. జనగామ మున్సిపాల్టీ పరిధిలో ఇప్పటికే సగం వార్డుల్లో ఇంటింటి ప్రచారం పూర్తి చేశారు. శుక్రవారం చేర్యాల మున్సిపాల్టీ వార్డుల్లో ముత్తిరెడ్డి సహా పల్లా సతీమణి నీలిమ, కుమారుడు అనురాగ్‌రెడ్డి సహా కుటుంబ సభ్యులు ప్రచార పర్వంలో పాల్గొంటున్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశాలు, సమ్మేళనాలతో వ్యూహాత్మకంగా ముందుకుకెళ్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో అభ్యర్థి కడియం శ్రీహరి ఊరూరా ప్రచారం చేస్తూనే వివిధ పార్టీల నుంచి పెద్దఎత్తున చేరికలతో వారి మద్దతును కూడగడుతున్నారు. ఇప్పటికే పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్‌ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరి గెలుపు ఖాయం కాగా, జనగామలో సీఎం సభ తర్వాత పల్లా గెలుపు ‘నల్లేరుపై నడకే’ అన్నది స్పష్టమైంది. ప్రచార కార్యక్రమాలతో గులాబీ శ్రేణులు అభ్యర్థులతో కలిసి గ్రామాలను చుట్టేస్తుంటే విపక్ష పార్టీల్లో ఆ సందడి కనిపించడంలేదు. ఇప్పటికే రెండుసార్లు గులాబీజెండా రెపరెపలాడిన జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ సెగ్మెంట్లలో హ్యాట్రిక్ దిశగా ముందుకెళ్తోంది.

**గులాబీ క్యాడర్‌లో మ్యానిఫెస్టో జోష్..**

జనగామ ప్రజా ఆశీర్వాద సభ తర్వాత గులాబీ క్యాడర్‌లో కొత్త ఉత్సాహం నెలకొన్నది. సభ ఊహించిన దానికంటే సూపర్ డూపర్ సక్సెస్ కావడంతో అటు నాయకులు, ఇటు గ్రామస్థాయి కార్యకర్తల్లో నయా జోష్ నింపింది. మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతుబంధు ఎకరానికి రూ.16 వేలకు వచ్చే ఐదేండ్లలో క్రమంగా పెంపు, సౌభాగ్యలక్ష్మి పేరుతో బీపీఎల్ కుటుంబాలకు చెందిన అర్హులైన మహిళలకు కొత్తగా నెలకు రూ.3 వేల గౌరవ భృతిపై అన్ని వర్గాల్లో బీఆర్ఎస్‌పై విశ్వాసం పెరుగుతున్నది. అర్హులైన పేద కుటుంబాలకు రూ.400కే వంట గ్యాస్ సిలిండర్, కేసీఆర్ ఆరోగ్యరక్ష ద్వారా రూ.15 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు రూ.15 లక్షల వరకు నగదు రహిత వైద్యబీమా, పేద కుటుంబాలకు రూ.5 లక్షల కేసీఆర్ బీమా ధీమా కల్పిస్తున్నది. సన్నబియ్యం, ఆసరా పింఛన్లను రూ.5016కు పెంపును మార్చి నుంచి దశలవారీగా అమలు చేస్తామన్న బీఆర్ఎస్ మ్యానిఫెస్టోకు లబ్ధిదారులు జేజేలు పలుకుతున్నారు.

**జిల్లాలో బీఆర్ఎస్‌కు ప్రజాదరణ..**

నాటి ఉద్యమంలో గులాబీజెండా గుండెగుండెనూ తాకితే..తొమ్మిదేండ్ల అభివృద్ధి, సంక్షేమంతో బంగారు తెలంగాణ వైపు సాగుతున్న బీఆర్ఎస్ పార్టీ గడపగడపకూ చేరువైంది. ఆదీ నుంచి అధినేత కేసీఆర్‌కు జైకొట్టిన జనగామ జిల్లా ప్రజలు 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తిరుగులేని మెజార్టీ కట్టబెట్టింది. ఇక రెండు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు అంతనంత దూరంలో కాంగ్రెస్ పార్టీ ఉంటే.. బీజేపీ మాత్రం కనీస డిపాజిట్ కోల్పోతూ వస్తున్నది. బీఆర్ఎస్ క్షేత్రస్థాయి ప్రజానీకానికి చేరువ కావడం..నిత్యం కండ్లముందే కనిపిస్తున్న అభివృద్ధి..సంక్షేమ పథకాలు..రానున్న ఐదేండ్లలో అమలు చేసేందుకు అధినేత ప్రకటించిన మ్యానిఫెస్టోను నమ్ముతున్న జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల ప్రజలు ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్‌కు పట్టం గట్టేందుకు సిద్ధమవుతున్నారు.

ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తిలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామలో డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరికి మునుపటి కంటే రెట్టింపు మెజార్టీ ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 2018–2023 మధ్య ప్రతి నియోజకవర్గంలోనూ అంచనాలకు మించి అభివృద్ధి జరిగిందని..ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయని..అందుకే గతంలో కంటే ఈసారి అదనపు మద్ధతు ఉంటుందనే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. జనగామలో ముత్తిరెడ్డి, పొన్నాల, స్టేషన్‌ఘన్‌పూర్‌లో రాజయ్య సహకారంతో కడియం గెలుపు ఖాయంగా కనిపిస్తుండగా..పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్‌రావు ఓటమెరుగని నాయకుడిగా అధిక మెజార్టీతో జయకేతనం ఎగురవేసేలా ముందుకెళ్తున్నాడు.

## నామినేషన్ల ప్రక్రియకు పటిష్ట బందోబస్తు

**ఆర్వో కార్యాలయం వద్ద 144సెక్షన్ అమలు**



పాలకుర్తిలోని ఆర్వో ఆఫీసు వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ కే సీతారాం, ఏసీపీ డీ రఘుచందర్

పాలకుర్తి రూరల్, నవంబర్ 3: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ ఉంటుందని జనగామ డీసీపీ కే సీతారాం అన్నారు. శుక్రవారం పాలకుర్తి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ బందోబస్తు ఏర్పాట్లపై వివరాలను వర్ధన్నపేట ఏసీపీ డి రఘుచందర్ నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ కోసం ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఆర్ఓ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యర్థి వెంట ముగ్గురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఎలక్షన్‌లలో పోటీ చేసే అభ్యర్థులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల కోసం ప్రతి నియోజక వర్గంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఏసీపీ రఘు చందర్, సీఐ దేవనపల్లి విశ్వేశ్వర్, ఎస్సైలు తాళ్ల శ్రీకాంత్, డి విజయ్‌కుమార్, లింగారెడ్డి, బండి శ్రావణ్‌కుమార్, కే శ్రావణ్‌కుమార్, సీఆర్పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

## యువతి అదృశ్యం

చిల్పూరు, నవంబర్ 3 : మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన మమత పాండ్యా (19 ) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. రెండు రోజుల క్రితం బయటకు వెళ్లిన పాండ్యా తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన తండ్రి పరమేశ్వరన్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట, నవంబర్ 3 : రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం జరిగింది. కాజీపేట జీఆర్పీ సీఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. కడిపికొండ బ్రిడ్జి సమీపంలోని వాషింగ్ సైడ్ లూప్ లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వయసు 35–40 ఏండ్ల మధ్య ఉంటుందని, కుడి చేతిపై ఎంపీ పింకీ అనే పచ్చబొట్టు ఉందన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖాన మార్చురీలో భద్రపరిచినట్లు ఆయన విలేకరులకు తెలిపారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HMDA అప్రూవ్డ్ ప్లాట్లు
★దసరా స్పెషల్ ఆఫర్! 5 గ్రా గోల్డ్ ఫ్రీ HMDA పరిధిలో ఇప్పుడే ఇల్లు కట్టుకొని ఉండటానికి తక్కువ ధరలోనే రెరా అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్స్ బ్యాంక్ లోన్, స్పాట్ రిజి: 8639545438.
NT-320354

WANTED




★హన్మకొండలోని ప్రముఖ లోన్స్ ఆఫీసు నందు పని చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం: 10,000/–, సంప్రదించండి సెల్: 9440805391.
NTW-00

★రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15–21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

BUSINESS OFFER
★ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న *బయోడిగ్రేడబుల్* కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9848211153, 9490786468.
NT-320324

PLOT FOR SALE



★మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు అతి తక్కువ ధరలో ప్లాట్లు. 121 చ.గజాల ప్లాట్ రూ. 2 లక్షలు. సెక్యూరిటీ, ఫెన్సింగ్, గేటు, స్పాట్ రిజిస్ట్రేషన్. 8179608180.
NT-318000

★హైదరాబాద్, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ, జనచైతన్య, బాటసింగారం శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును/ అమ్మబడును, నో Brokers. Ph: 9666912111, 7995005999.
NT-318030

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

| HANAMKONDA | WARANAGAL |
|---|---|
| 9182777563 | 9182777556 |
| 9182777618 | 9182777557 |
| 9182777213 | 9182777558 |

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565